సాక్షి
అనకాపల్లి
ఆదివారం ı 15 ı సెప్టెంబర్ ı 2024



పూర్వ వీసీకి సత్కారం

సీతంపేట (విశాఖ): ఇంజినీర్స్ డే సందర్భంగా కృష్ణా వర్సిటీ పూర్వ వీసీ ఎస్.రామ కృష్ణారావును ఘనంగా సత్కరించారు.



లక్ష గరిక పూజ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద విద్యార్థులు విఘ్నేశ్వరుడికి లక్ష గరిక పూజ నిర్వహించారు.



యోగా పోటీలు ప్రారంభం

భీమిలి: కేతిన్‌పేట వద్ద ఉన్న సన్‌స్కూల్‌లో శనివారం రాష్ట్రస్థాయి యోగా పోటీలు ప్రారంభమయ్యాయి.

న్యూస్‌రీల్

వైద్యుల విధుల బహిష్కరణ

చోడవరం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 85ను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యులు చేస్తున్న శాంతియుత నిరసనను మండలంలోని గవరవరం ప్రాథమిక వైద్య కేంద్రం, చోడవరం సామాజిక ఆస్పత్రుల్లోని వైద్య సిబ్బంది పాటించారు. ఔట్ పేషెంట్స్ సేవలు, సర్వేల నిర్వహణ, ఎఫ్‌డీపీలు, రిపోర్టింగ్, వాయిస్ కాల్స్, వీడియో కాల్స్ వంటివి చేపట్టలేదు. అత్యవసర కేసులకు సంబంధించి వెసులుబాటు కల్పించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేసే వరకు తమ నిరసన కొనసాగుతుందని, శాంతియుతంగానే తాము ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని గవరవరం ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ అన్నారు.

ఓపీ సేవల బహిష్కరణ

మాకవరపాలెం : జీవో 85కు నిరసనగా మండలంలోని మాకవరపాలెం, బూరుగుపాలెం పీహెచ్‌సీల వైద్యులు సీతారామలక్ష్మి, చరిష్మ ఓపీ సేవలను బహిష్కరించారు. ఈ జీవోను వ్యతిరేకిస్తూ ఈ నెల 10 నుంచి నిరసన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతున్నారు. శనివారం అత్యవసర సేవలు మినహా, ఓపీ సేవలను బహిష్కరించారు.

కిసాన్ మహిళా మిత్ర ఒప్పందం

అచ్యుతాపురం (మునగపాక): అచ్యుతాపురంలోని కిసాన్ మహిళా మిత్ర ఫార్మర్ ప్రొడ్యూసర్ కో-ఆపరేటివ్ సొసైటీ తమ సేవలను మరింత విస్తరించేందుకు అవసరమయ్యే చర్యలు ప్రారంభించింది. జాతీయ కో-ఆపరేటివ్ కన్స్యూమర్స్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌సీసీఎఫ్) కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థతో స్థానిక కిసాన్ మహిళా మిత్ర సొసైటీ శనివారం ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం రైతుల నుంచి పంటను సేకరించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ధర కంటే అదనంగా చెల్లిస్తారు. సంబంధిత నగదును రైతుల ఖాతాల్లో 5 నుంచి 10 రోజుల్లోగా జమ చేస్తారు.

రేపు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' రద్దు

తుమ్మపాల: ఈనెల 16న కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసల్ సిస్టం) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మిలాద్ ఉన్ నబీ పండగ కావడంతో ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించింది. దీంతో కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

భస్మ సహిత చందనం అలంకరణలో విఘ్నేశ్వరుడు



చోడవరం: వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో భస్మ సహిత చందనం అలంకరణలో కార్యసిద్ధి గణపతిస్వామి భక్తులకు శనివారం దర్శనమిచ్చారు. ఎనిమిదో రోజు భస్మ సహిత చందనం అలంకరణలో స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామివారికి ప్రత్యేక కుంకుమార్చన, అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు.

వరద బాధితులకు రూ.కోటి సాయం

కశింకోట: మండలంలోని ఏఎస్ పేట వద్ద చెట్టినాడ్ సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం రూ.కోటి అందజేసింది. ఈ మొత్తం చెక్కును పరిశ్రమల సీఎండీ డాక్టర్ ముత్తయ్య రామస్వామి సీఎం చంద్రబాబునాయుడుకు అందించినట్లు ఇక్కడి పరిశ్రమ హెడ్ ప్రసాద్‌బాబు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నరసింహరాజులు శనివారం తెలిపారు.

సామాన్యులకు అందని ద్రాక్ష



కొత్త వైద్య కళాశాలలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం సరైంది కాదు. గత సర్కారు 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను మంజూరు చేసింది. అందులో ఐదు కళాశాలల్లో గత ఏడాది నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్ల మా అబ్బాయి రాజమండ్రి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించగలిగాడు. ఇలా గత ఏడాది ఏపీలో 750 మంది విద్యార్థులకు అవకాశం లభించింది. రానున్న కాలేజీలను పూర్తి చెయ్యకుండా ప్రైవేటుపరం చెయ్యడం వల్ల వైద్య విద్య పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా మారే ప్రమాదం వుంది. ప్రైవేటు రంగానికి అప్పగించడం వల్ల ఫీజుల భారం భరించలేక పేదలు విద్యకు దూరం అవుతారు. – కళ్ల రాము, వైద్య విద్యార్థి తండ్రి, కె.జె.పురం, మాడుగుల మండలం



మాడుగుల రూరల్/అనకాపల్లి:

పేదలపై ఎందుకంత కక్ష?



గత వైఎస్ జగన్ సర్కారు చేపట్టిన 'జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కాలేజీ' విధానం మాలాంటి పేద విద్యార్థులకు వరం. గత ఏడాది ఐదు కళాశాలలు ప్రారంభం కావడంతో ప్రతి చోట 150 మందికి సీటు లభించింది. గతంలో మెడికల్ విద్యకు ఇతర దేశాలు, రాష్ట్రాలకు వెళ్లేవాళ్లం, మన రాష్ట్రంలో మెడికల్ కళాశాలలు ఉన్నట్లయితే మాలాంటి పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయి. కోట్లాది రూపాయలు చెల్లించి ప్రైవేట్ కళాశాలల్లో చదవాలంటే అందరికీ సాధ్యం కాదు కదా. ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచన చేయాలి. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న అన్ని మెడికల్ కళాశాలలను పూర్తి చేసి ప్రభుత్వ ఆధీనంలోనే విద్యాబోధన చేయాలి. –ఆర్.ఆదికేశవ, నీట్ విద్యార్థి, అనకాపల్లి

చేయి తిరిగిన చేనేత కార్మికులు వారు.. వస్త్ర రంగంలో సరికొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. వారు తయారు చేసే వస్త్రాలు చిరకాలం గుర్తుండిపోతాయి. చీరల్లో జమదానీకి ఎంతో ప్రత్యేకత ఉంది. ఈ జమదానీ చీరల తయారీలో పాయకరావుపేట చేనేత కార్మికులు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ప్రత్యేకమైన ఆకర్షణలు, వివిధ రకాల డిజైన్లతో మగువల మనసు దోచే జమదానీ చీరలు తయారు చేస్తుంటారు. కొత్త అందాలను తెచ్చే ఈ చీరలు వివాహాది శుభకార్యాల్లో తళుక్కుమంటుంటాయి. మన నేత కార్మికుల నైపుణ్యానికి అద్దం పడుతున్నాయి.





పేటకు పట్టం కట్టిన కోక



- జమదానీ చీరలతో సరికొత్త ఒరవడి
- దేశ విదేశాల్లో అద్వితీయ ఆదరణ
- పాయకరావుపేట నేతన్నల ప్రతిభ

నక్కపల్లి/పాయకరావుపేట : పాయకరావుపేటతో పాటు, కాకినాడ జిల్లా పిఠాపురం, ఉప్పాడ తదితర ప్రాంతాల్లో తయారయ్యే ఈ జమదానీ చీరలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందాయి. జమదానీ చీరల డిజైన్లతో కేంద్రప్రభుత్వం తపాలాశాఖ పోస్టల్ కవర్ కూడా విడుదల చేసిందంటే ఈ చీరలకు ఉన్న ప్రత్యేకత ఎంటో తెలుస్తోంది. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట పట్టణంలో 500 మంది చేనేత కార్మికులు ఉన్నారు. వీరంతా చేనేతనే వృత్తిగా చేసుకుని ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి పొందుతున్నారు. స్థానికంగా విక్రయించేందుకు నేత చీరలు, పంచెలు, తువాళ్లు, తక్కువ ధరలకు విక్రయించే చీరలు తయారు చేస్తూ చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకుని విక్రయిస్తుంటారు. గ్రామాల్లో టోకు పద్ధతిలో విక్రయించడంతో పాటు పాయకరావుపేట, తుని పట్టణాల్లో ఉన్న వస్త్ర దుకాణాలకు తాము తయారు చేసిన వస్త్రాలను సరఫరా చేస్తుంటారు.

జమదానీ చేనేతలో 15 కుటుంబాలు

వీరిలో 15 కుటుంబాలు మాత్రం ప్రత్యేకంగా జాందానీ చీరలు తయారు చేస్తుంటారు. జమదానీ చీరలు తయారు చేయడానికి ముడిసరుకు (నూలు) బెంగళూరు నుంచి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇది ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్నది కావడంతో తక్కువమంది మాత్రమే ఈ చీరలను తయారు చేస్తున్నారు. పట్టణానికి చెందిన ఒక వ్యక్తి ముడిసరుకు కొనుగోలు చేసి తీసుకువచ్చి తనకు వచ్చిన ఆర్డర్ల మేరకు కొనుగోలుదారులు కోరిన, సూచించిన డిజైన్లు, మోడళ్ల ఆధారంగా ఇక్కడి కార్మికులతో జాంధాని చీరలను తయారు చేయిస్తారు.



పాయకరావుపేటలో జమదానీ చీరల తయారీలో కార్మికులు

ఆర్డర్లపైనే తయారీ..

ఇక్కడ తయారు చేయించిన జమదానీ చీరలను హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విశాఖపట్నం, ముంబై, కోల్‌కతా వంటి మహానగరాల్లో ఉన్న పెద్ద వస్త్ర దుకాణాలకు విక్రయిస్తుంటారు. ముందుగానే ఆర్డర్లు ఇచ్చి జమదానీ చీరలు తయారు చేయిస్తుంటారు. ఒక జమదానీ చీర తయారీకి డిజైన్‌ను బట్టి రూ.3 వేల నుంచి రూ.5 వేల విలువ గల నూలు అవసరమవుతుంది. ఒక చీర తయారీకి 15 రోజుల సమయం పడుడుతుంది. ఇద్దరు నేత కార్మికులు 15 రోజుల పాటు కష్టపడితే ఒక జమదానీ చీర తయారవుతుంది. ఇలా నెలకు రెండు నుంచి మూడు చీరలు తయారు చేస్తారు. ఇక్కడ తయారయ్యే జమదానీ చీరల ఖరీదు కనిష్టంగా రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు ఉంటుంది. ఇంటివద్దనే ఉంటూ నెలకు రెండు చీరలు తయారు చేస్తే మజూరి కింద రూ.10 వేలు చెల్లిస్తారు. జమదానీ చీరలు తయారు చేయించి విక్రయించే వ్యక్తికి నూలు, మజూరి ఖర్చు పోను చీర దగ్గర రూ.3 నుంచి రూ.5 వేలు మిగులుతుంది. ఇతని దగ్గర రూ.10వేలు పెట్టి కొనుగోలు చేసిన చీరను పెద్ద పెద్ద మాల్స్, షాపుల్లోను 50 శాతం లాభం వేసుకుని రూ.15 వేలకు విక్రయిస్తుంటారని కాంట్రాక్టర్లు చెబుతున్నారు.

గత ప్రభుత్వంలో నేతన్నలకు పెట్టుబడి సాయం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నేతన్నలకు పెట్టుబడి సాయం అందించారు. మగ్గం కలిగిన కుటుంబాలకు నెలకు రూ.2వేల చొప్పున ఏడాదికి రూ.24వేలు ఆర్థిక సాయం నేరుగా వారి ఖాతాల్లోనే జగనన్న ప్రభుత్వం జమ చేసింది. దీంతో కార్మికులు నేరుగా ముడిసరకు తామే కొనుగోలు చేసుకుని వస్త్రాలు తయారు చేసి లాభాలు పొందేవారు. పెట్టుబడికి అప్పు చేసే పరిస్థితి లేకపోవడంతో గత ఐదేళ్లు చేనేత రంగానికి స్వర్ణయుగంగానే గడిచింది. అయితే ప్రభుత్వం మారాక నేతన్న నేస్తం ఊసే లేదు. వారికి ఆర్థిక సాయం ఇంతవరకు అందలేదు. కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించే పరిస్థితి కూడా కనిపించకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.


నెలకు 60 నుంచి 100 చీరల తయారీ..

పాయకరావుపేటలో జాందాని చీరలను తయారు చేసే కార్మికులు సాధారణ డిజైన్లవి నెలకు 100 చీరలు, ప్రత్యేక డిజైన్లు అయితే 60 చీరలు తయారు చేయగలుగుతారు. ముడిసరుకు కొనుగోలు చేసే స్థోమత లేకపోవడంతో ఇక్కడి కార్మికులు కేవలం మజూరీ కోసమే పనిచేయాల్సి వస్తుంది. బెంగళూరు వెళ్లి ముడిసరుకు కొనుగోలు చేయడం, మార్కెటింగ్ చేయడం చాలా కష్టతరం కావడంతో కాంట్రాక్టరు ఇచ్చిన మజూరీ తీసుకుని తమ వస్త్ర నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. జాందాని చీరల తయారీలో పట్టును ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ రకం చీరల తయారీ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎక్కడా లూజు అనేది రాకూడదు. అడ్డు నిలువులో పట్టును ఉపయోగించాలి. దీంతో ఒక్కో చీర తయారీలో ముగ్గురు కార్మికుల అవసరం కూడా ఉంటుందని నేత కార్మికులు అంటున్నారు. చీర డిజైన్‌ను బట్టి తయారీకి సమయం తీసుకుంటుంది.



పాయకరావుపేట కార్మికులు తయారు చేసిన జమదానీ చీరలు


పూర్వీకుల నుంచి ఇదే వృత్తి



పూర్వీకుల నుంచి ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం ఉండడం లేదు. గత ప్రభుత్వంలో నేతన్న నేస్తం కింద ఏడాదికి రూ.24వేలు సాయం అందించారు. ప్రస్తుతం ఈ పథకం ఉందో లేదో కూడా తెలియడం లేదు. సొంతంగా మగ్గం పెట్టుకుని చీరలు తయారీ చేసే వసతి లేదు. అద్దె ఇంట్లో మగ్గాలు పెట్టుకుని వస్త్రాలు తయారు చేసి మజూరు తీసుకుని జీవిస్తున్నాం. నెలకు రెండు జాందాని చీరలు తయారు చేస్తే రూ.10 వేలు వస్తోంది. ఇద్దరం కష్టపడాల్సి వస్తుంది. నూలు కొనుగోలు చేసే స్థోమత లేదు. మార్కెటింగ్ చేయడం మాకు చేత కాదు. దీంతో కాంట్రాక్టరు చెప్పిన ఆర్డర్ మేరకు చీరలు నేసి ఇస్తున్నాం.

–మహేశ్వరి, నేత కార్మికురాలు

నేతన్న నేస్తం ఆగిపోయింది...



పాయకరావుపేటలో చేయి తిరిగిన నేత కార్మికులు ఉన్నారు. వివిధ రకాల డిజైన్లతో పట్టు, జాందాని చీరలు తయారీ చేయడంలో వీరు దిట్ట. ముడిసరుకు సొంతంగా కొనుగోలు చేసే స్థోమత లేకపోవడంతో మజూరు కోసమే వస్త్రాలు తయారు చేస్తుంటారు. ఇక్కడ చేనేత సొసైటీకి ప్రభుత్వ ప్రోత్సాహం లేదు. ముడిసరుకు కొనుగోలుకు రాయితీలు ఇవ్వడం లేదు. మార్కెటింగ్ సదుపాయం కూడా లేకపోవడంతో కాంట్రాక్టర్లే వీరిని ఆదుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంలో నేతన్న నేస్తం కింద ఆర్థిక సాయం చేయడం వల్ల కార్మికులు పెట్టుబడి కోసం అప్పు చేయకుండా నూలు కొనుగోలు చేసి వస్త్రాలు తయారు చేసి కొద్ది మేరకు లాభాలు పొందేవారు.

–వీరనాగేశ్వరరావు, సొసైటీ మేనేజర్

ఏపీఐఐసీ నిర్వాసితుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్

- 17న కలెక్టర్ కార్యాలయంలో నిర్వహణ

నక్కపల్లి: విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం కోసం నక్కపల్లి మండలంలో ఏపీఐఐసీ సేకరించిన భూములకు సంబంధించి సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 17న (మంగళవారం) అనకాపల్లిలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం జరుగుతుందన్నారు. భూసేకరణలో నేటి వరకు నష్టపరిహారం అందని రైతులు వారి వద్ద ఉన్న అన్ని ఆధారాలు, పూర్తి డాక్యుమెంట్లతో హాజరు కావాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి నర్సీపట్నం ఆర్డీవో, ఏపీఐఐసీ జెడ్‌ఎం, ఎస్‌డీసీలు వారి సిబ్బంది నక్కపల్లి తహసీల్దార్, వారి కార్యాలయ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. కాగా ఈ గ్రీవెన్స్‌ను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కాకుండా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళన ఫలితం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా ఏపీఐఐసీ వారు సేకరించిన భూములను స్వాధీనం చేసుకుని స్టార్టప్ ఏరియాలో మౌలిక సదుపాయాల పనులు ప్రారంభించే చర్యలు చేపట్టింది. రెండు రోజుల క్రితం భారీ పోలీసు బందోబస్తు మధ్య అధికారులు స్టార్టప్ ఏరియాలో పనులు ప్రారంభించడాన్ని రైతులు, వైఎస్సార్‌సీపీ, సీపీఎం నాయకులు అడ్డుకున్నారు. భూములిచ్చిన రైతులకు ఇంకా నష్ట పరిహారం చెల్లించాల్సి ఉందని, సమస్య పరిష్కరించే వరకు పనులు జరగనివ్వబోమని భీష్మించారు. తహసీల్దార్ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లతంతో ఈనెల 17న రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు.

వై.లోవలో ఉద్రిక్తత

- నేవీ రక్షణ గోడ నిర్మాణానికి వ్యతిరేకంగా గ్రామస్తుల ఆందోళన
- ఆర్డీవో, డీఎస్పీ నచ్చచెప్పినా శాంతించని బాధితులు
- సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన అధికారులు
- గ్రామస్తుల ఇక్కట్లపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశం
- వై.లోవను నేవీ నిర్వాసిత గ్రామంగా గుర్తించాలని ప్రజల డిమాండ్



నేవల్ బేస్ రక్షణ గోడ నిర్మాణానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న వై.లోవ గ్రామ ప్రజలు

రాంబిల్లి (యలమంచిలి): ఒకపక్క నేవల్‌బేస్ ప్రాజెక్ట్ రక్షణ గోడ నిర్మాణం.. మరోపక్క శారదానది వరద ముప్పు.. వీటి మధ్య తమ జీవనం ఎలా సాగించాలి అంటూ వై.లోవ గ్రామ ప్రజలంతా ఏకమై శనివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు నిరసన తెలిపారు. గ్రామంలో రక్షణ గోడ నిర్మాణాన్ని ఆపి ప్రధాన రహదారికి అడ్డంగా టెంట్‌లు వేసి, ముళ్ల కంచెలు రోడ్డుకు అడ్డంగా వేసి ఆందోళన చేపట్టారు. ఇళ్లను ఆనుకొని రక్షణ గోడ నిర్మాణం చేపడుతున్నారని, దీని వలన ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. సముద్రానికి వెళ్లే శారదానదికి రజాల వద్ద జాలీలు ఏర్పాటు చేయడంతో అక్కడ చెత్త పేరుకుపోయి నీరు సమీపంలో ఉన్న పంట పొలాలను ముంచెత్తుతోందని వివరించారు. తుపాన్లు వచ్చినప్పుడు వరద బారిన పడకుండా కొండ ప్రాంతంలో తలదాచుకుంటున్నామని, ఇప్పుడు కొండ చుట్టూ నేవీ అధికారులు రక్షణ గోడ నిర్మిస్తున్నారని, వరదలొస్తే తమ గతేమిటని అధికారులను నిలదీస్తూ గ్రామ ప్రధాన రహదారిపై బైఠాయించారు. సమాచారం అందుకున్న అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ, పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, తహసీల్దార్ పి.భాగ్యవతి, సీఐ నరసింగరావు సంఘటన స్థలానికి చేరుకొని వై.లోవ గ్రామ ప్రజలతో మాట్లాడటానికి ప్రయత్నించగా.. కలెక్టర్ వచ్చి మాట్లాడాలని నినాదాలు చేశారు. ఆర్డీవో కలెక్టర్ విజయ కృష్ణన్‌కు ఫోన్‌లో పరిస్థితిని వివరించారు. గ్రామస్తుల డిమాండ్లను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని, వారి న్యాయమైన డిమాండ్లను లిఖితపూర్వంగా తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.



వై.లోవ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్ని కృష్ణ, డీఎస్పీ సత్యనారాయణ


డిమాండ్లు ఇవీ..

కలెక్టర్ దృష్టికి తేవాల్సిందిగా ఆర్డీవో, డీఎస్పీలకు గ్రామ ప్రజలు తమ సమస్యలు వివరించారు. గ్రామంలో 400 కుటుంబాలకు జీవనోపాధిని కల్పించాలని, ఏ ఇంటికీ ప్రమాదం వాటిల్లకుండా 15 అడుగుల దూరం వదలి నేవీ రక్షణ గోడ నిర్మించాలని, శ్మశానవాటిక నిర్మాణానికి కొండ ప్రాంతంలో 50 సెంట్ల స్థలం కేటాయించాలని, తుపాన్ షెల్టర్ నిర్మించాలని తమ డిమాండ్ చేశారు. ఆర్డీవో చిన్ని కృష్ణ మాట్లాడుతూ ఒక డిప్యూటీ తహసీల్దార్ పర్యవేక్షణలో 15 అడుగుల దూరం పాటిస్తూ రక్షణ గోడ నిర్మాణం చేపడతామని, శ్మశానవాటికకు స్థలం కేటాయిస్తామని, పాత శ్మశాన వాటికను అభివృద్ధి చేస్తామని చెప్పారు. మిగతా సమస్యలు కలెక్టర్ దృష్టిలో పెడతామని, వాటి పరిష్కారానికి కొంత సమయం కావాలని అడగడంతో.. గతంలో చాలాసార్లు అధికారులు వచ్చి చర్చలు జరిపారే గానీ తమ సమస్యలు పరిష్కరించడం లేదని గ్రామస్తులు పెదవి విరిచారు. ఇక మీదట అలా జరగదని ఆర్డీవో హామీ ఇవ్వడంతో సాయంత్రం ఆందోళన విరమించారు. సర్పంచ్ నారాయణరావు, మాజీ సర్పంచ్ బద్ది నారాయణరావు, సిటు నాయకులు దేముడు నాయుడు, కూండ్రపు సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.


లోక్ అదాలత్‌లో పరిష్కారమైతే అపీల్ లేదు

చోడవరం రూరల్: లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం చేసుకుంటే దానిపై కోర్టులో అపీల్ చేయడానికి సైతం అవకాశం లేదని 9వ అదనపు జిల్లా జడ్జి కె.రతన్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక కోర్టుల సముదాయంలో జరిగిన లోక్ అదాలత్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కోర్టులలో పేరుకు పోతున్న కేసుల కారణంగా కక్షిదారులు పంతాలు, పట్టింపులకు పోకుండా తమ కేసులను తగిన విధంగా పరిష్కారం చేసుకోవాలని కోరారు. లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాలు తమ తమ కేసులలో తగిన రీతిలో పరిష్కార మార్గాలు కనుగొని ఆ దిశగా ముందడుగేయాలని కోరారు.

కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక సబ్ జడ్జి ఈ.రాజేంద్రబాబు మాట్లాడుతూ ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ కాలాన్ని, ధనాన్ని వృధా చేసుకోవద్దని సూచించారు. ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.సూర్యకళ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.అప్పలరాజు, చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్, న్యాయవాదులు ఆర్.ఎస్.పి.నాయుడు, డి.పైడిరాజు, కె.లక్ష్మణరావు, డి.శివప్రసాద్‌లు పాల్గొన్నారు. మెగా లోక్ అదాలత్‌లో 549 కేసులో పరిష్కారం అయ్యాయని కోర్టు వర్గాలు తెలిపాయి.



చోడవరం: లోక్ అదాలత్ సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి రతన్‌కుమార్



అనకాపల్లి: ఫ్యామిలీ కోర్టు కేసులో మహిళకు రూ.3 లక్షల పరిహారం అందజేస్తున్న జడ్జి

అనకాపల్లిలో 800 కేసులు పరిష్కారం

అనకాపల్లి: పదో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.శ్రీవిద్య నేతృత్వంలో స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 800 సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కారమయ్యాయి. సుమారు రూ.2.50 కోట్ల విలువైన తగాదాలు రాజీ పడినట్టు కోర్టు వర్గాలు తెలిపాయి.

క్లుప్తంగా

17న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

తుమ్మపాల: 'జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం'లో భాగంగా ఈ నెల 17న జిల్లాలో ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు బాల బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు డీఎంహెచ్‌వో బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో చదివే విద్యార్థులకు, పాఠశాలకు వెళ్లని వారు, కౌమార బాల బాలికలకు ఉచితంగా అందిస్తామన్నారు. 1, 2 సంవత్సరాల వయసు పిల్లలకు సగం మాత్రను, 2 నుంచి 3 సంవత్సరాల వయసు పిల్లలకు పూర్తి మాత్రను నీటిలో కరిగించి తాగించాలని సూచించారు. 3 నుంచి 19 సంవత్సరాల వయసు వారికి పూర్తి మాత్రను చప్పరించేటట్లు చూడాలన్నారు. మధ్యాహ్నం భోజనం చేసిన అర గంట తర్వాత మాత్రలు వేయాలన్నారు. మాత్రను చప్పరించడం వల్ల ఎటువంటి దుష్పరిణామాలు కలుగవన్నారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఈ నెల 25న మాప్ అప్ రౌండ్ కార్యక్రమంలో ఈ మాత్రను తప్పక వేసుకోవాలన్నారు.

శ్రీ నర్తన గణపతిగా సంపత్ వినాయగర్

సీతమ్మధార(విశాఖ): ఆశీలమెట్టలో సంపత్ వినాయగర్ స్వామి శనివారం భక్తులకు శ్రీ నర్తన గణపతి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి హోమం, నాదస్వర కచేరి, ఉభయ దాతలచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

అంపశయ్యపై ఆత్మగౌరవం

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడే బాధ్యత నాది. తెలుగు ప్రజల ఆత్మగౌరవం, సెంటిమెంట్, త్యాగాలను అమ్మేస్తామంటే చూస్తూ ఊరుకోను. చేత కాకపోతే తప్పుకోండి.. నేను ఎంతవరకైనా వెళ్లి ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటాను'. ఎన్నికలకు ముందు చంద్రబాబు డాబు మాటలు.

'ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తే కార్మికుల కడుపే కాలుతుంది. మీరు ఉద్యమించకుండా.. నన్ను రోడ్డు మీదకు రమ్మంటే రాను. మీరు బయటకొస్తే.. నేను మీతో కలిసి వస్తాను.. కేంద్రాన్ని ఒప్పంచి ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకునే బాధ్యత నాది.' ఎన్నికలకు ముందు పవన్ కల్యాణ్ ఊగిపోతూ చేసిన ప్రగల్భాలు.

వీరి మాటలు నమ్మిన ప్రజలు కూటమికి అధికారం అప్పగించారు. అధికారం చేపట్టిన మూడు నెలల్లోనే కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ఊపిరి తీస్తుంటే.. చంద్రబాబు, పవన్‌లు కనీసం నోరు మెదపడం లేదు. నిర్వీర్యం దిశగా ఉక్కు పరిశ్రమను తీసుకుపోతున్నా.. దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదు. మూలధన సంక్షోభాన్ని అధిగమించే పేరుతో ఆస్తుల వేలానికి పూనుకున్నా.. రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు మూసేసి ఉత్పత్తి తగ్గించే కుట్రలు చేస్తున్నా.. 500 మంది అధికారులను డిప్యూటేషన్‌పై ఇతర స్టీల్‌ప్లాంట్లకు, వీఆర్‌ఎస్ పేరుతో 4 వేల మందిని ఇంటికి పంపించే పన్నాగాలు పన్నినా.. ఆర్డర్లు మూసేసి దివాలా సంస్థగా స్టీల్‌ప్లాంట్‌ను చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నా.. అటువైపు కన్నెత్తి చూసే ధైర్యం చేయడం లేదు.

- శరవేగంగా స్టీల్‌ప్లాంట్ నిర్వీర్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అడుగులు
- పరిశ్రమలో ఉత్పత్తి తగ్గించి నష్టాల్లో ఉన్నట్లు చూపించే కుట్రలు
- రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల మూసివేతతో 35 వేల టన్నులకు పడిపోయిన ఉత్పత్తి
- నోరు మెదపని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్
- ఉద్యమాన్ని తీవ్రతరం చేసిన కార్మికులు.. నేడు మహా ధర్నా

విశాఖ సిటీ: కూటమికి అధికారాన్ని అప్పగిస్తే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయంపై కేంద్రం వెనక్కి తగ్గుతుందని.. కోటి ఆశలతో గెలిపించిన కార్మికులు, ఉద్యోగులు, తెలుగు ప్రజలకు చంద్రబాబు అండ్ కో గట్టి షాకిచ్చింది. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ప్రక్రియ వేగవంతమయ్యేలా తీసుకుంటున్న నిర్ణయాల పట్ల కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తుంటే.. కూటమి నేతలు మాత్రం తప్పించుకొని తిరుగుతున్నారు. ఎన్నికలకు ముందు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా అడ్డుకుంటామని, అవసరమైతే ఉద్యమిస్తామని చెప్పిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇప్పుడు నిరసనలు తెలుపుతున్న కార్మికుల నోళ్లను బలవంతపు అరెస్టులతో మూయించాలని చూస్తుండడం గమనార్హం. స్టీల్‌ప్లాంట్ నిర్వీర్యానికి చాపకింద నీరులా తీసుకున్న నిర్ణయాలు రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరిస్తోందని స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కమిటీ నాయకులు, కార్మికులు రగిలిపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా ఆదివారం మహా ధర్నాకు సిద్ధమయ్యారు.



మూడు నెలల్లో పరిస్థితి తారుమారు



అన్నపూర్ణ బ్లాస్ట్‌ఫర్నేస్-3

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే స్టీల్‌ప్లాంట్ పరిస్థితి తారుమారైంది. తెలుగుదేశం మద్దతుతో కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటికీ ఎన్డీయే వరుస నిర్ణయాలతో స్టీల్‌ప్లాంట్‌ను దివాలా దిశగా తీసుకువెళ్తోంది. ముందుగా మూలధనం సమీకరణ పేరుతో ఆస్తుల వేలానికి సిద్ధమైంది. ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై నగరాల్లో ఉన్న ఖరీదైన భవనాలు, స్టాక్‌యార్డుల విక్రయానికి రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్(ఇస్పాత్) బోర్డు ఆమోదం తెలిపింది. ఈ మొత్తం ఆస్తుల మార్కెట్ విలువ రూ.476.18 కోట్లుగా లెక్కగట్టింది. ఆ వెంటనే ఉత్పత్తిని తగ్గించే కుట్రలో భాగంగా రెండు నెలల క్రితం బ్లాస్ట్ ఫర్నేస్-1ను మూసివేసింది. సాధారణంగా స్టీల్‌ప్లాంట్‌కు ఏటా 73 లక్షల టన్నుల స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం ఉంది. కానీ సంస్థ నిర్వీర్యం చేయడానికి బ్లాస్‌ఫర్నేస్-1ను మూసేసిన కేంద్రం.. తాజాగా రెండు రోజుల క్రితం బ్లాస్ట్‌ఫర్నేస్-3ని బ్లోడౌన్ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం బ్లాస్ట్ ఫర్నేస్-2 ద్వారా మాత్రమే ఉత్పత్తి జరుగుతోంది. సాధారణంగా ఒక్కో దాని నుంచి రోజుకు 7 వేల టన్నుల ఉత్పత్తి అవకాశమున్నప్పటికీ.. బీఎఫ్-2 ద్వారా కేవలం 4 నుంచి 5 వేలు మాత్రం స్టీల్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ప్రధానంగా సంస్థను ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించడానికి మూలధనం వ్యయం ఇవ్వని కేంద్రం.. సుమారు 4 వేల మంది ఉద్యోగులను వీఆర్‌ఎస్ పేరుతో ఇంటికి పంపించడానికి రూ.1261 కోట్లు కేటాయించడం విశేషం. దీంతో పాటు మరో 500 మంది ప్లాంట్ అధికారులను ఛత్తీస్‌గఢ్‌లోని నగర్‌నార్ స్టీల్‌ప్లాంటుకు డిప్యుటేషన్‌పై పంపాలని తీర్మానించారు. వీరితో పాటు 25 శాతం మంది సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది తగ్గించాలని నిర్ణయించారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఈ వరుస నిర్ణయాలతో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు ఉలిక్కిపడ్డారు. దీనిపై వరుస ఉద్యమాలకు సిద్ధమయ్యారు.

కన్నా.. అప్పుడే నూరేళ్లు నిండాయా..

- ములకలాపల్లిలో విద్యుత్ షాక్‌కు గురై బాలుడి మృతి
- ఇంట్లో ఫ్యాన్ ప్లగ్ పెడుతుండగా ప్రమాదం



కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

దేవరాపల్లి: అప్పటి వరకు తమ కళ్ల ఎదుట ఉన్న కుమారుడు విద్యుత్ ఘాతానికి గురై క్షణాల వ్యవధిలోనే విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. అప్పుడే నూరేళ్లు నిండాయా.. బిడ్డా అని రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. మండలంలోని ములకలాపల్లిలో శనివారం సాయంత్రం విద్యుత్ షాక్ గురై పదేళ్ల బాలుడు మృతి చెందాడు. కుటుంబీలు, స్థానికుల కథనం మేరకు... గ్రామానికి చెందిన వడగళ్ల గణేష్, భవానీ దంపతులకు ఇద్దరు కుమారులు హేమంత్, యశ్వంత్ ఉన్నారు. చిన్న కుమారుడు యశ్వంత్ (10) ఇంట్లో ఫ్యాన్ కోసం ప్లగ్ పెడుతుండగా విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. వెంటనే కుటుంబీకులు బయటకు తీసుకువచ్చి ఇసుకలో వేసి రక్షించే ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. అప్పటికే ప్రాణాలు విడిచాడు. కుమారుడి మృతదేహం వద్ద తల్లి భవానీ గుండెలవిసేలా రోదించిన తీరు పలువురి హృదయాలను కలచివేసింది. యశ్వంత్ స్థానిక ప్రాథమిక పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్నాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

త్రిశక్తి స్వరూపిణి 'పరమేశ్వరి'





సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనం.. శ్రద్ధగా ఆలకిస్తున్న భక్తజనం

- ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖశర్మ

అనకాపల్లి: పరమేశ్వరి త్రిశక్తి స్వరూపిణి అని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. అమ్మవారిని ఆరాధిస్తే సకల ఐశ్వర్యాలు ప్రసాదిస్తుందని తెలిపారు. మెయిన్‌రోడ్డులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ శతజయంతి వేడుకల్లో భాగంగా పరమేశ్వరి వైభవంపై ఆయన అనుగ్రహ భాషణం చేశారు. పార్వతీ పరమేశ్వరులు ఈ విశ్వానికి తల్లిదండ్రులని పేర్కొన్నారు. బిడ్డలు తప్పు చేస్తే అమ్మ మాత్రమే క్షమిస్తుందని, స్త్రీలను దేవతలుగా పూజించే సంస్కారం భారతదేశంలో ఉందని అన్నారు. ప్రకృతి స్వరూపమైన అమ్మవారిని ప్రతి ఒక్కరూ ఆరాధించాలని తెలిపారు. లలితా సహస్రనామం పఠిస్తే అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను అనుగ్రహిస్తారన్నారు. అమ్మవారు దుర్గాదేవిగా శక్తిని, లక్ష్మీదేవిగా ఐశ్వర్యాన్ని, సరస్వతీదేవిగా జ్ఞానాన్ని ప్రసాదిస్తారని తెలియజేశారు. ఈ ముగ్గురమ్మలు కలిసి పరమేశ్వరి దేవిగా శక్తి స్వరూపిణియై లోకాన్ని కాపాడతారని, భక్తులను అనుగ్రహిస్తారని తెలియజేశారు. భగవంతుడిని మనం పట్టించుకోకపోయినా, భగవంతుడు మనల్ని పట్టించుకుంటారని వివరించారు. అమ్మవారిని పూజించి, అనుగ్రహం పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ శతజయంతి ఉత్సవాల కమిటీ కో-చైర్మన్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. సామవేదం షణ్ముఖశర్మ ముందుగా కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు శతజయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు పూర్ణకుంభంతో స్వాగతించారు. ఆది, సోమవారాల్లోనూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పరమేశ్వరి అమ్మవారి ప్రవచనాలు ఉంటాయని బుచ్చిరాజు తెలిపారు.

రంగస్థల అనుభవంతో 350పైగా చిత్రాల్లో నటించా


- జబర్దస్త్ అప్పారావు



కె.కోటపాడు : రంగస్థల కళాకారుడిగా గడించిన అనుభవంతోనే 24 ఏళ్ల కాలంగా 350కు పైగా చిత్రాల్లోను, 70కు పైగా సీరియల్స్‌లోను నటించినట్లు జబర్దస్త్ అప్పారావు అన్నారు. శనివారం కె.కోటపాడులో ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 1984 నుంచి రంగస్థలం కళాకారుడిగాను, బుర్రకథ, జానపద గీతాలను పాడుతుండేవాడినని తెలిపారు. తనకు నాటక రంగానికి మాదేటి వెంకట లక్ష్మణరావు, సినిమా రంగానికి లంక సత్యానందం గురువులని పేర్కొన్నారు. ఇన్నాళ్ల పాటు కళాకారునికి కళారంగానికి సేవ చేస్తూ ప్రేక్షకుల అభిమానం పొందినట్లు తెలిపారు. శుభవేళ చిత్రం తనకు మొదటి సినిమా అని అన్నారు. సరిలేరు నీకేవ్వరూ, చందమామ, మహాత్మ, మిణుగురులు తదితర చిత్రాలు తనకు మంచి పేరును తీసుకువచ్చినట్లు తెలిపారు.

ఊబిని పూడ్చినా.. మళ్లీ ప్రమాదం

- సరియా జలపాతంలో ఇద్దరు గల్లంతు
- ఒకరు శ్రీకాకుళం జిల్లా, మరొకరు విశాఖ జిల్లా వాసి
- గాలించినా లభ్యం కాని ఆచూకీ
- తల్లడిల్లుతున్న కుటుంబసభ్యులు



సరియా జలపాతం వద్ద ప్రమాదం జరిగిన ప్రాంతం

అనంతగిరి (అరకులోయ రూరల్): సరియా జలపాతం వద్ద సుమారు రెండేళ్ల తరువాత మళ్లీ ప్రమాదం చోటుచేసుకుంది. ఇక్కడ ఊబిలు ఉన్నందున తరచూ ప్రమాదాలు జరిగేవి. ఇప్పటివరకు సుమారు 40 మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే వీటిని నివారించేందుకు స్థానిక పోలీసులు చొరవ చూపారు. ప్రమాదాలు జరిగే ప్రాంతంలో ఎస్‌ఐ కరక రాము ఆధ్వర్యంలో రెండేళ్ల క్రితం బ్లాస్టింగ్ చేసి బండరాళ్లను తొలగించి ఊబిని పూడ్చారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఎటువంటి ప్రమాదాలు జరగలేదని స్థానికులు చెబుతున్నారు.

భారీగా తరలివచ్చిన సందర్శకులు

శనివారం సెలవుదినం కావడంతో పరిసర జిల్లాల నుంచి భారీగా సుమారు 1500 మంది వరకు సందర్శకులు తరలివచ్చారు. అందరిమాదిరిగానే శ్రీకాకుళం జిల్లా పైడి భీమవరానికి చెందిన లంక సాయి కుమార్ (30), విశాఖకు చెందిన నేవీ ఉద్యోగి దిలీప్‌కుమార్ (30) స్నేహితులు, కుటుంబాలతో జలపాతం వద్దకు వచ్చారు. వీరిలో సాయికుమార్ స్నానం చేస్తుండగా బండరాయి పైనుంచి జారిపోయి జలపాతంలో పడిపోయాడు. మునిగిపోతున్న అతనిని రక్షించేందుకు అక్కడే ఉన్న నేవీ ఉద్యోగి దిలీప్‌కుమార్ ప్రయత్నించారు. ప్రవాహం ఉధృతంగా ఉండటంతో కొట్టుకుపోయిన ఇద్దరు గల్లంతయ్యారు. వీరికోసం గాలింపు చేపట్టినా వారి ఆచూకీ లభ్యం కాలేదని ఎస్‌ఐ కరక రాము తెలిపారు. దీంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

ఎసైన్షియా ఫార్మా బాధితులకు వైఎస్సార్‌సీపీ అండ



క్షతగాత్రుడు నాగభూషణంకు చెక్కు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

- క్షతగాత్రులకు రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేత

యలమంచిలి రూరల్/మునగపాక: అచ్యుతాపురం సెజ్ ఎసైన్షియా ఫార్మా పరిశ్రమ ప్రమాద బాధితులకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. అనకాపల్లిలోని ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో బాధితులను జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించేందుకు రావడంతోనే ప్రభుత్వంలో కదలిక వచ్చిందన్నారు. గత నెల 21న ఎసైన్షియా ఫార్మా పరిశ్రమలో ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ మేరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున పార్టీ తరఫున ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రమాదంలో గాయపడిన మునగపాక మండలం వాడ్రాపల్లికి చెందిన మళ్ల నాగభూషణంకు, యలమంచిలి మండలం సోమలింగపాలెం గ్రామానికి చెందిన పిల్లా మోహన్‌బాబాకు లక్ష రూపాయల చొప్పున సాయాన్ని ప్రసాద్‌తో పాటు పార్టీ నేతలు శనివారం వేర్వేరుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఫార్మా ప్రమాదం దురదృష్టకరమన్నారు. బాధిత కుటుంబాలకు జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మనసుతో పార్టీ తరఫున సాయం అందించారన్నారు. ఇటువంటి ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ ఎంపీపీ బొద్దపు ఎర్రయ్యదొర, యలమంచిలి మున్సిపల్ వైస్ ఛైర్మన్ అర్రెపు గుప్తా, వార్డు కౌన్సిలర్లు పిట్టా సత్తిబాబు, రాపేటి సంతోష్, దూది నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ మునగపాక మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరహా, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, శరగడం జగన్నాథరావు, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు పాల్గొన్నారు.



గాయపడిన ఉద్యోగి కుటుంబానికి రూ.లక్ష చెక్కు అందజేస్తున్న పార్టీ నాయకులు


పాముకాటుతో యువకుడి మృతి



మృతుడు శివ


నక్కపల్లి: మండలంలో డొంకాడ గ్రామానికి చెందిన సఖిరెడ్డి శివ(31) పాముకాటుకు గురై మరణించాడు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం పది గంటలకు శివ తన పొలంలో పనులు చేస్తుండగా గుర్తుతెలియని పాము ఎడమకాలుపై కాటేసింది. ఇది గమనించిన వెంటనే కుటుంబ సభ్యులకు తెలియజేయగా, వారు హుటాహుటిన తునిలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం సామర్లకోటలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించినట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటరావు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



పాయకరావుపేట: పట్టణంలో చెక్కా సూర్యనారాయణ నగర్ సమీపాన రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని తుని రైల్వే హెచ్‌సీ జి.మోహన్‌రావు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల సమయంలో రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడు వయస్సు 40 సంవత్సరాలు ఉంటుందని, నాచురంగు, చిన్న చిన్న తెలుపు రంగు చుక్కల షర్టు, ఆకుపచ్చ రంగు ప్యాంటు మృతుడి శరీరంపై ఉన్నాయన్నారు. ఎడమ చేతి పై బెంగాలీ భాషలో పచ్చబొట్టు ఉందన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

రైలు ప్రమాదంలో గాయపడిన గుర్తుతెలియని మహిళ మృతి



అనకాపల్లి: పట్టణ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైలు నుంచి జారిపడిన మహిళ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు దువ్వాడ జీఆర్పీ ఎస్‌ఐ శాంతారాం శనివారం చెప్పారు. ఎస్‌ఐ వివరాలు మేరకు... ఈ నెల 10న యలమంచిలి – విశాఖ వెళ్లే రైలు మార్గంలో గుర్తుతెలియని రైలు నుంచి 40–45 సంవత్సరాలు కలిగిన గుర్తుతెలియని మహిళ పడిపోయింది. స్థానికులు గుర్తించి 108 వాహనంలో స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి బంధువులు 7673906010 సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

ప్రేమ సమాజానికి సరకుల వితరణ



నిత్యావసర సరకులు అందజేస్తున్న సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి : యలమంచిలి మండలం కొక్కిరాపల్లి ప్రేమ సమాజానికి అనకాపల్లి సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.11 వేలు విలువ చేసే నిత్యావసర సరకులు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.వి.గౌరీపతి మాట్లాడుతూ ఏడాదిలో ప్రతి నెల అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా కొక్కిరాపల్లి ప్రేమ సమాజానికి అందజేశామన్నారు. దశల వారీగా వృద్ధాశ్రమాలు, దివ్యాంగులు, అనాథాశ్రమాలకు తమ వంతు సహాయం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత తహసీల్దార్ వీరభద్రరావు, విశ్రాంత డీఈ గోవిందరావు, సభ్యులు ఆళ్ల అప్పారావు, ప్రభాకర్, స్వామి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

31 హెక్టార్లలో వరి పంట నష్టం

కశింకోట : మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు 31 హెక్టార్లలో వరి మునిగి నష్టం ఏర్పడినట్లు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించామని మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న తెలిపారు. వెదురుపర్తి, ఉగ్గినపాలెం, గొబ్బూరు, ఏఎస్ పేట, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, ఏనుగుతుని తదితర గ్రామాల్లో నష్టాన్ని గుర్తించామన్నారు. ఈ మేరకు నివేదించినట్లు తెలిపారు.

ధ్యాన వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ధ్యాన వేంకటేశ్వర స్వామి

కశింకోట : కశింకోటలో కొలువుదీరిన ధ్యాన వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని వజ్ర కవచంతో పాటు పుష్పమాలలు, తులసి మాలలతో విశేషంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 118 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,540	5,200
రెండో రకం	3,410	4,200
మూడోరకం	3,310	3,380

అనకాపల్లి సినిమాలు

35..చిన్నకథకాదు	: రాజా
ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్	: సత్యనారాయణ స్క్రీన్-1
మత్తు వదలరా 2	: సత్యనారాయణ స్క్రీన్-2
ఆయ్	: పర్తిసాయి
సరిపోదా శనివారం	: షిర్డీసాయి
ఉత్సవం	: వెంకటేశ్వర
కళింగ	: శ్రీసత్య
భలేఉన్నాడే	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 68 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, బీ పాజిటివ్-26 యూనిట్లు, ఓ పాజిటివ్-24 యూనిట్లు, ఏబీ పాటిజివ్-6 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 316 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 289 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

ఎంతో సులభం.. నగదు రహితం

- వ్యాపారమంతా డిజిటల్ రూపంలోనే
- 80 శాతం లావాదేవీలు ఈ పద్ధతిలోనే
- చిల్లర కష్టాలు.. దొంగ నోట్ల సమస్యకు చెక్

ఒకప్పుడేమో కానీ ఇప్పుడు మారుమూల ప్రాంతాల్లో కూడా డిజిటల్ లావాదేవీలు పెరిగాయి. నిన్న మొన్నటి వరకూ పెద్దపెద్ద షాపింగ్ మాల్స్, వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్లు నేడు చిన్న వ్యాపారులు, తోపుడు బళ్ల విక్రేతల వద్ద కూడా చూస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం పెద్దనోట్లు రద్దు చేసిన తర్వాత డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించేదుకు ప్రత్నించినా అప్పట్లో ప్రజలు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఆ విధానం ఎలా పని చేస్తుందో తెలియకపోవటం, దానిపై అవగాహన లేకపోవడంతో చిరు వ్యాపారులు తొలుత దాని వైపు మొగ్గు చూపలేదు. అయితే తర్వాత పరిస్థితి మారింది. ఇందులోని సౌలభ్యాన్ని గుర్తించిన వ్యాపారులంతా ఇప్పుడు దాని వైపే మొగ్గు చూపుతున్నారు.



మెయిన్‌రోడ్డులోని ఫ్రూట్స్ దుకాణం వద్ద డిజిటల్ లావాదేవీల బోర్డు

అనకాపల్లి : డిజిటల్ పేమెంట్ల వల్ల దొంగనోట్ల సమస్యకు అడ్డుకట్ట పడింది. నగదు లావాదేవీల్లో కొన్ని సార్లు చిరువ్యాపారులు అనేక ఇబ్బందులు పడేవారు. గతంలో షాపింగ్ మాల్స్, పెద్ద వ్యాపార సంస్థల్లో మాత్రమే పేమెంట్ యాప్‌లు, క్రెడిట్, డెబిట్ కార్డులతో లావాదేవీలు జరిగేవి. ఆన్‌లైన్ చెల్లింపుల వల్ల తమ ఖాతాల్లో నగదు ఇతరుల ఖాతాల్లోకి వెళ్లిపోతుందేమో అన్న భయంతో చిన్న పట్టణాలు, గ్రామాల్లో ఆన్‌లైన్ చెల్లింపుల జాడ పెద్దగా కనిపించేది లేదు. కోవిడ్ తర్వాత నగదురహిత లావాదేవీల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఆ సమయంలో నగదు తీసుకోవాలంటే ప్రజలు భయపడేవారు. అప్పటి నుంచి డిజిటల్ లావాదేవీలపై ఆసక్తి పెంచుకున్నారు. కిరాణా, టీ దుకాణాలు, కూరగాయలు, ఫ్యాన్సీషాప్‌లు, మందుల దుకాణాలు, ఫ్రూట్ షాపులు, పెట్రోల్ బంకులు తదితర చోట్ల లక్షల రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయి. క్యూఆర్ కోడ్‌తోనూ చెల్లింపులు చేస్తున్నారు. ఆర్టీసీ బస్‌లు, రైళ్లు, విమానాల్లోను డిజిటల్ వ్యాపారం పెరిగింది. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా నగదురహిత లావాదేవీలు జరుగుతున్నాయి. బ్యాంకుల్లో లోన్లు తీసుకునే వ్యక్తులు ఉన్న చోటే ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా నగదురహిత లావాదేవీలు జరుపుతున్నారు. ఫోన్‌పే చేసే సమయంలో ఆడియో బాక్స్ ద్వారా నగదు బ్యాంక్ ఖాతాలో జమ అయినట్లు వాయిస్ మెసేజ్ ద్వారా తెలుస్తోంది. గతంలో కొన్ని ప్రాంతాల్లో ఆడియో వాయిస్ లేకపోవడంతో మోసాలు జరిగాయి.



వేల్పులవీధి పార్కు సెంటర్ పాన్‌షాప్ వద్ద డిజిటల్ పేమెంట్ చేస్తున్న వినియోగదారుడు

మోసాలకు అడ్డుకట్ట..

దొంగ నోట్లను పూర్తిస్థాయిలో నిరోధించాలంటే డిజిటల్ లావాదేవీలు ఒక్కటే మార్గమని కేంద్రం చర్యలు చేపట్టింది. నేడు జేబులో ఒక్క రూపాయి కూడా లేకుండా బ్యాంక్ ఖాతాలో నగదు ఉంటే దేశంలో ఎక్కడికెళ్లినా డిజిటల్ లావాదేవీలతో తిరిగి రావచ్చనే నమ్మకం ప్రజల్లో పెరిగింది. సామాన్య రైతు నుంచి పెద్ద వ్యాపారి వరకూ ఇప్పుడు నూటికి 80 శాతం డిజిటల్ లావాదేవీలనే అనుసరిస్తున్నారు.

కూరగాయల మార్కెట్‌లో..

అనకాపల్లి కూరగాయల మార్కెట్‌లో రోజుకు రూ.60 లక్షల నుంచి రూ. 70 లక్షల వరకు లావాదేవీలు జరుగుతుండగా.. అందులో సుమారు రూ. 50 లక్షల వరకూ డిజిటల్ తరహాలోనే జరుగుతున్నాయి. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి మార్కెట్‌కు లారీల ద్వారా వచ్చే కూరగాయలకు ఆన్‌లైన్‌లో పేమెంట్ చేస్తున్నారు.

దొంగనోట్ల సమస్య లేదు..



గతంలో ఏది కొనుగోలు చేయాలన్నా తప్పనిసరిగా నగదు ఉండాల్సి వచ్చేది. ప్రస్తుతం చేతిలో రూపాయి లేకపోయినా దర్జాగా మనకు కావాల్సినవి కొనుగోలు చేసుకోవచ్చు. దొంగనోట్ల సమస్య లేదు. నగదు జేబులో పెట్టుకుంటే పోతుందనే భయం ఉంటుంది. ఆన్‌లైన్ వ్యవహారం అందుబాటులోకి వచ్చాక ఆ సమస్య లేకుండా పోయింది.

– కాండ్రేగుల అప్పారావు, వినియోగదారుడు

ఈ విధానం సురక్షితం..



నేను వృత్తిరీత్యా వాహనాలు రిపేర్ చేస్తుంటాను. పని హడావుడిలో స్పేర్ పార్టుల కొనుగోలు సమయంలో చాలా సార్లు నగదు పోగొట్టుకుని సొంత డబ్బులు పెట్టుకోవాల్సి వచ్చేది. ఫోన్‌పే ఉపయోగిస్తున్నప్పటి నుంచి ఆ బాధ తప్పింది. ఈ విధానం ఎంతో సులువుగాను, సురక్షితంగాను ఉంది.

– సత్తిబాబు, బైక్ మెకానిక్, శాఖవీధి

చిల్లర సమస్య లేదు..

నేరుగా జరిపే నగదు లావాదేవీల కన్నా డిజిటల్ విధానమే బాగుంది. చిల్లర సమస్య లేదు. మోసాలకు తావు లేదు. రానున్న రోజుల్లో పూర్తిగా నగదురహిత లావాదేవీలే జరుగుతాయి. ఈ విధానం వల్ల పని కూడా తొందరగా అవుతుంది. రోజుకు రూ. 6 వేల వరకు డిజిటల్ లావాదేవీల జరుగుతుండగా.. నగదు లావాదేవీలు కేవలం రూ. వెయ్యి మాత్రం జరుగుతున్నాయి.

– సూరిబాబు, పండ్ల వ్యాపారి, అనకాపల్లి

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం



వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ

అనకాపల్లి : మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తెలిపారు. స్థానిక మెయిన్ రోడ్డులో శనివారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణించరాదని, వారు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని తెలిపారు. మైనర్ డ్రైవింగ్‌పై దృష్టి సాధించామన్నారు. రోజుకు 100 కేసులు నమోదు చేసి, ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం తనిఖీలు నిర్వహిస్తున్నామని, నెలకి 2500 నుంచి 3 వేల కేసులు నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు. కేసులు రాసిన వాహనాలను కోర్టులో హాజరు పరుస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

నష్టపోయిన వరి నాట్ల అంచనాకు చర్యలు



మునిగిన వరినాట్లను పరిశీలిస్తున్న అధికారులు

అనకాపల్లి : తుపాను కారణంగా మండల పరిధిలో వర్షాలకు మునిగిపోయి, పాడైపోయిన వరినాట్లకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు నష్టం అంచనా వేయనున్నట్లు తహసీల్దార్ వై.శ్రీరామమూర్తి, మండల వ్యవసాయశాఖ అధికారి పి.రంగాచారి తెలిపారు. స్థానిక జాతీయ రహదారి ఆవఖండం సాత్-2 పొలాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రంగాచారి మాట్లాడుతూ నీట మునిగిన వరి నాట్లకు సంబంధించి అంచనా వేస్తున్నట్లు తెలిపారు. రైతు ఎంత విస్తీర్ణంలో సాగు వేశాడు.. ఎంత నష్టం జరిగిందనే దానిపై పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. పూర్తి నివేదిక సిద్ధమైన తర్వాత అధికారులకు అందజేస్తామన్నారు.

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీవిద్య

అనకాపల్లి : రాజీ మార్గం ద్వారా సమస్యలు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పదో అదనపు న్యాయమూర్తి ఎన్. శ్రీవిద్య అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిన్నచిన్న గొడవలు పెంచుకుని బంధుత్వాలు పోగొట్టుకోవద్దని ఆమె తెలిపారు. కోర్టుల చుట్టూ తిరిగితే ఆర్థికంగా కూడా ఇబ్బందులు ఉంటాయన్నారు. సమన్వయం పాటిస్తు సమస్యలు పరిష్కరించుకునేందుకు కృషి చేయాలని తెలిపారు. 800 సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించామని తెలిపారు. రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఫ్యామిలీ కేసుకు సంబంధించి మెయింటెనెన్స్ నిమిత్తం మహిళకు రూ.3 లక్షల నగదు ఇప్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజీవీఎస్ కుమార్, కార్యదర్శి దుర్గారావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.

ఏచూరికి ముఠా కార్మికుల నివాళి



తాళ్లపాలెంలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముఠా కార్మికులు

కశింకోట: కమ్యూనిస్ట్ యోధుడు సీతారామ్ ఏచూరికి ముఠా కార్మికులు నివాళులర్పించారు. మండలంలోని తాళ్లపాలెంలో ముఠా కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీతారామ్ ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ముఠా కార్మిక ప్రతినిధులు బి.నూకరాజు, కె.నాగరాజు, బెన్నయ్య, అప్పలనాయుడు, ఎస్‌పిఈఆర్‌డి యూనియన్ మండల అధ్యక్షుడు ఎస్.కె. రెహమాన్, ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గణపతి ఉత్సవాలు



కశింకోటలోని జెడ్పీ హైస్కూల్ వద్ద అయ్యప్ప రూప వినాయకుని దర్శించుకుంటున్న ప్రజలు



సాయినగర్ కాలనీలో మహిళల సారె ఊరేగింపు



గణపతి మండపంలో దీపారాధన చేస్తున్న మహిళలు

కశింకోట: గణపతి నవరాత్రి మహోత్సవాలను కశింకోటలో కనులపండువగా నిర్వహిస్తున్నారు. సాయినగర్ కాలనీలో వినాయక ఉత్సవాల్లో భాగంగా మహిళలు సారె ఊరేగింపు నిర్వహించారు. వివిధ రకాల పిండి వంటకాలతో వాయిద్యాలతో, బాణ సంచా కాలుస్తూ ఊరేగింపుగా వెళ్లి సారె సమర్పించారు. రాత్రి దీపారాధన చేశారు.

● స్థానిక డీపీఎస్ జెడ్పీ హైస్కూలు వద్ద గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన అయ్యప్ప రూప వినాయకుడిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ మండపంతో పాటు స్థానిక గవరపేట మధ్య వీధిలోని వినాయక మండపాల వద్ద భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్, జనసేన నాయకుడు రాంకీ, సీఐ అల్లు స్వామినాయుడు తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఘనంగా హిందీ దివస్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న గాయత్రి స్కూల్లో హిందీ దివస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీ వ్యాస రచన పోటీలు, నాటిక, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. హిందీ కవుల వేషధారణతో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బి.రామ్‌కుమార్, హెచ్ఎం వై. నగేష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

18 నుంచి ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పోటీలు



కశింకోట హైస్కూల్ సమావేశంలో పాల్గొన్న అధికారులు

కశింకోట: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఈ నెల 18 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. స్థానిక బాలికల హైస్కూల్లో అధికారులు, హెచ్ఎంలు, పీడీలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. బాలికల హైస్కూల్‌తో పాటు డీపీఎస్ జెడ్పీ హైస్కూల్లో బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చదరంగం, యోగా, షటిల్, అథ్లెటిక్స్ తదితర పోటీలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సమావేశంలో ఎంఈఓలు పి.వెంకట సురేష్, మూర్తి, హెచ్ఎంలు ఎం.ఎస్.స్వర్ణకుమారి, ఆచంట రవి, పీడీలు పెంటకోట కమల, వి.ప్రభాకరరావు పాల్గొన్నారు.

వినూత్నంగా గణిత బోధన

ఆసక్తితో నేర్చుకుంటున్న విద్యార్థులు



వెదురుపర్తిలో హైస్కూల్ విద్యార్థులకు రేఖా గణిత భావనలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు




చెట్టు కొలతలు, ఘన పరిమాణం కనుగొనడంపై విద్యార్థులకు వివరిస్తున్న ఉపాధ్యాయులు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి హైస్కూల్ విద్యార్థులకు గణిత శాస్త్రంలోని పాఠ్యాంశాలను వినూత్నంగా బోధిస్తున్నారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను పాఠశాల పరిసరాల్లో ఆటలతో, ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఆసక్తితో అభ్యసిస్తున్నారు.

గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు ఏవీఎస్ మూర్తి విద్యార్థులకు పాఠ్యాంశాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు నెలకోసారి క్షేత్రస్థాయికి తీసుకువెళ్లి బోధిస్తున్నారు. దీనిలో భాగంగా 8,9,10 తరగతుల విద్యార్థులకు క్రికెట్ ఆట రూపంలో నిరూపక రేఖా గణితం పాఠ్యాంశం బోధించారు. విద్యార్థులతో క్రికెట్ ఆట ఆడించి, రేఖీయ సమీకరణాలను గుర్తించే విధానంపై అవగాహన కలిగించారు. అలాగే స్థూపం ఆకారంలో ఉన్న చెట్టు ఘన పరిమాణం, వక్రతల వైశాల్యం, దీర్ఘ ఘనాకారంలో ఉన్న వాటర్ ట్యాంక్ ఘన పరిమాణం, వివిధ రూపాల్లో ఉన్న వాటి ఘన పరిమాణం, వైశాల్యం, వాటి కొలతలను తీసుకొని గణిత సూత్రాల ద్వారా లెక్కలు గణించడాన్ని బోధించారు. దీంతో విద్యార్థులు ఎంతో ఆసక్తితో నేర్చుకున్నారు. గతంలో కూడా పంట పొలాలకు తీసుకెళ్లి భూముల కొలతల గురించి అవగాహన కల్పించినట్లు విద్యార్థులు తెలిపారు.

వేతన బకాయిలు చెల్లించాలి



ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల 5 నెలల బకాయిలు తక్షణమే చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ నెల 15 నుంచి ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్థానిక వైద్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ 14 రోజులుగా నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తున్నా కాంట్రాక్టర్ గానీ, ప్రభుత్వ అధికారులు గానీ పట్టించుకోలేదన్నారు. ఒప్పంద కార్మికులకు సంబంధించి గుత్తేదారు వ్యవస్థను రద్దు చేయాలని, పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్‌లో కలపాలని కోరారు. కార్మికులకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు నూకరాజు, సంతోష్, కిరణ్, అడవి రాజు, రామ్ ప్రసాద్, వరలక్ష్మి, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా మానవతా సంస్థ సేవలు

అనకాపల్లి: పర్యావరణ పరిరక్షణకు, ఇతర సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తున్నామని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి విశాఖ జిల్లాల ఇన్‌చార్జి కోడూరు రాధా పుష్పవతి అన్నారు. స్థానిక ఉడ్‌పేట ప్రైవేట్ భవనంలో సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 80వేల మంది సభ్యులతో ఇప్పటి వరకు 121 యూనిట్లను ఏర్పాటు చేశామన్నారు. పర్యావరణ పరిరక్షణ, రక్తదాన శిబిరాలు, పేదలకు వైద్య పరీక్షలు, పిల్లల విద్యకు సహకారం తదితర కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.